గోల్కొండ ఎల్లమ్మ బోనాల ఉత్సవాలకు భారీగా తరలివచ్చిన భక్తులు

ఎల్లమ్మకు మూడో బోనం

మెహిదీపట్నం, జూలై 14: గోల్కొండలో కొలువైన జగదాంబిక మహంకాళి ఎల్లమ్మ అమ్మవారికి భక్తులు ఆదివారం మూడో బోనం సమర్పించారు. అమ్మవారికి మొక్కులు చెల్లించుకునేందుకు నగరం నలుమూలల నుంచి భక్తులు తరలిరావడంతో గోల్కొండ కోట కిటకిటలాడింది. మెహిదీపట్నం, ఆసిఫ్‌నగర్, చింతల్‌బస్తీ, పురానాపూల్, నానల్‌నగర్, లంగర్‌హౌస్, రాజేంద్ర నగర్, గండిపేట తదితర ప్రాంతాల నుంచి భక్తులు తొట్టెలను ఊరేగింపుగా తెచ్చి.. అమ్మవారికి సమర్పించారు. భక్తులకు ఎలాంటి ఆటంకాలు కలుగకుండా దక్షిణ, పశ్చిమ మండలం డీసీపీ చంద్రమోహన్ ఆధ్వర్యంలో ఈవో శ్రీనివాస్ రాజు, బోనాల ఉత్సవ కమిటీ చైర్మన్ కాంత అరవింద్ మహేశ్‌కుమార్, బోనాల కులవృత్తుల సంఘం అధ్యక్షుడు సాయిబాబాచారి ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టారు. అమ్మవారికి చేసిన పుష్పాలంకరణ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

ప్రజాభవన్‌లో బోనాల ఉత్సవాల్లో ఘటం తీసుకువస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క

టీహబ్‌లో బోనాల ఉత్సవాల్లో పాల్గొన్న మహిళలు

మాట్లాడుతున్న ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి

నిరుద్యోగులపై నిందలు సరికాదు

- మెగా డీఎస్సీ హామీ ఏమైంది..
- సీఎం రేవంత్ వ్యాఖ్యలు సిగ్గుచేటు
- ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి

బడంగ్‌పేట, జూలై14: కాంగ్రెస్ ప్రభుత్వం నిరుద్యోగుల జీవితాలతో చెలగాటమాడుతుందని మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి విమర్శించారు. ఆదివారం అల్మాస్‌గూడ తిరుమల్ నగర్ కాలనీలో పర్యటించి ఆమె మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి నిరుద్యోగల సమస్యలను పరిష్కరించకుండా తప్పించుకోవడానికి కోచింగ్ సెంటర్ల మీద, నిరుద్యోగుల మీద నిందలు వేస్తున్నారని ఆరోపించారు. ఎన్నికల ముందు బీఆర్ఎస్ ప్రభుత్వం 11వేల పోస్టులు వేసిందన్నారు. అప్పుడు మెగా డీఎస్సీ ద్వారా 25 వేల పోస్టులు వేస్తామని ఎందుకు హామీ ఇచ్చారని ఆమె ప్రశ్నించారు. టెట్ పరీక్ష రాసిన తర్వాత 45 రోజులు సమయం ఇవ్వాలని కోరుతుండగా ఎందుకు ఇవ్వడం లేదన్నారు. పరీక్షలు రాయని వారే ధర్నా లు చేస్తున్నారని సీఎం రేవంత్‌రెడ్డి అనడం సిగ్గుచేటన్నారు. ఎన్నికల ముందు నిరుద్యోగులకు ఇచ్చిన మెగా డీఎస్సీ ఏమైందన్నారు. 2014 కు ముందు తెలంగాణ రాష్ట్రం ఏ విధంగా ఉందో తెలంగాణ రాష్ట్రం వచ్చిన తర్వాత అభివృద్ధి ఎలా ఉందో ప్రజలు ఇప్పుడు గమనిస్తున్నారన్నారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రణాళిక బద్ధంగా రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తుంటే నిరుద్యోగులను రెచ్చగొట్టి అధికారంలోకి వచ్చిన తర్వాత నిరుద్యోగుల పై నిర్బంధ కాండ ప్రయోగిస్తున్నారన్నారు. సీపీఐ నాయకులను సైతం అరెస్టు చేస్తున్నారంటే సీఎం రేవంత్ రెడ్డి ఇక ఎవరిని వదిలిపెడుతారన్నారు. గత ప్రభుత్వం మున్సిపాలిటీలలో అభివృద్ధి చేయడానికి ప్రత్యేక నిధులు కేటాయిస్తే కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రూ. 250 కోట్లు నిధులు రద్దు చేశారన్నారు.

విదేశాల్లో బోనాలకు విశేష ఆదరణ

అమ్మవారికి పట్టు వస్త్రాలు తీసుకెళుతున్న అక్కన్న మాదన్న మహంకాళి ఆలయ కమిటీ ప్రతినిధులు

కాచిగూడ, జూలై 14: పొరుగు రాష్ట్రాలు, విదేశాల్లోను తెలంగాణ బోనాలకు విశేష ఆదరణ ఉందని ఆలయ కమిటీ అధ్యక్షుడు జగన్మోహన్ పెర్షద్ అన్నారు. హరిబౌలిలోని అక్కన్న మాదన్న మహంకాళి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ప్రతినిధులు ఆదివారం వరంగల్ శ్రీ భద్రకాళి అమ్మవారికి 56 రకాల స్వీట్స్, కుంకుమ, పూలు, పండ్లు, పట్టు వస్త్రాలు సమర్పించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి దత్తాత్రేయ, కోశాధికారి సతీశ్,ప్రతినిధులు క్రాంతికుమార్, కృష్ణ, వినోద్, రమేశ్‌బాబు, రాజు, గోపాల్, జోగేందర్‌సింగ్, రవీందర్రాచారి,రాంసింగ్, ముకేశ్, మహేశ్,అజయ్, సాయినాథ్, షిండే, ప్రణీత్, పవన్, సూరి, సరిత, మంజుల పాల్గొన్నారు.

అందర్జాతీయ సదస్సులో ఓయూ ప్రొఫెసర్

ఉస్మానియా యూనివర్సిటీ, జూలై 14: అమెరికా, థాయిలాండ్ లలో జరిగిన అంతర్జాతీయ సదస్సుల్లో ఉస్మానియా యూనివర్సిటీ కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్ మెంట్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ శ్రీరాములు పాల్గొని పరిశోధనా పత్రం సమర్పించారు. అమెరికాలోని మిల్లింకిన్ యూనివర్సిటీలో జరిగిన ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ వర్క్ షాప్‌లో ప్రొఫెసర్ శ్రీరాములు పాల్గొని 'డైనమిక్స్ ఆఫ్ కన్సూమర్ ప్రిఫరెన్సెస్ ఫర్ బ్రాండెడ్ లగ్జరీ కార్స్ ఇన్ హైదరాబాద్: యాన్ ఇండియన్ కేస్ స్టడీ'అనే అంశంపై పరిశధనా పత్రం రూపొందించి సమర్పించారు. అనంతరం బ్యాంకాక్‌లోని ది గ్రాండ్ ఫోర్ వింగ్స్ కన్వెన్షన్ హోటల్‌లో నిర్వహించిన సదస్సుకు అధ్యక్షత వహించారు.

మనువాద చట్టాలను వ్యతిరేకించాలి

రవీంద్రభారతి, జూలై14: న్యాయ విద్య చదువుతున్న విద్యార్థులకు మనుసంస్కృతి బోధించాలని కేంద్ర మానవనరుల శాఖ ఢిల్లీ యూనివర్సిటీకి వచ్చిన ప్రతిపాదనలను ఢిల్లీ యూనివర్సిటీ వ్యతిరేకంగా తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతిస్తున్నామని దళిత బహుజన పార్టీ డీబీపీ జాతీయ అధ్యక్షుడు , సుప్రీం కోర్టు న్యాయవాది వడ్లమూరి కృష్ణ స్వరూప్ ప్రకటించారు. ఆదివారం పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ బీజేపీ సర్కార్ సిద్ధం చేసిన మనువాద చట్టాలు రాజ్యాంగానికి వ్యతిరేకమని తెలిపారు. మను సంస్కృతిని యూనివర్సిటీ న్యాయ విద్యలో బోధించమని ఆర్ ఎస్ఎస్, బీజేపీ చేస్తున్న విధానాలను వ్యతిరేకించాలన్నారు.

రెండో దశ మెట్రోకు అడ్డంకులు

క్షేత్ర స్థాయి సర్వేలో స్పష్టత కరువు

డీపీఆర్ రూపకల్పనలో జాప్యం

వ్యయంపై అంచనాలు తారుమారు

సిటీబ్యూరో, జూలై 14 (నమస్తే తెలంగాణ): మెట్రో రెండో దశ ప్రాజెక్టుకు ఆదిలోనే ఎన్నో అడ్డంకులు ఎదురవుతున్నాయి. నిర్దేశిత లక్ష్యాలు పెట్టుకున్నా అవి సకాలంలో పూర్తి చేయలేకపోతున్నారు. ఒకవైపు జనరల్ కన్సల్టెన్సీ సంస్థ, మరోవైపు హైదరాబాద్ మెట్రో అధికార యంత్రాంగం క్షేత్ర స్థాయిలో చేపట్టిన ట్రాఫిక్ సర్వే, నిర్ణీత కారిడార్‌ల అధ్యయనంలో స్పష్టత రావడం లేదు. ఇదే విషయమై హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ (హెచ్ఎండీఏ) పరిధిలోని ఉమ్టా (యునిఫైడ్ మెట్రో ట్రాన్స్‌పోర్ట్ అథారిటీ) సంస్థ ప్రత్యేకంగా మరో అధ్యయాన్ని నిర్వహిస్తోంది. రెండో దశపై ఎంతో కసరత్తు చేస్తున్నా సమగ్ర ప్రాజెక్టు నివేదికపై కొలిక్కి రావడం లేదు. ఫలితంగా మే-జూన్ నాటికే సిద్ధం కావాల్సిన రెండో దశ మెట్రో డీపీఆర్ రూపకల్పనలో తీవ్ర జాప్యం కావడంతో పాటు ప్రాజెక్టుకు అయ్యే వ్యయంపై అంచనాలు సైతం తారుమారవతున్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రెండో దశ మెట్రోను 70 కి.మీ మేర విస్తరించాలని ఎంతో హడావుడి చేసి 6 నెలలు గడుస్తున్న ఇప్పటికీ ఒక అంచనా రాలేదు. మొత్తం 7 మెట్రో మార్గాల్లో 70 కి.మీ మేర రెండో దశలో మెట్రోను పొడిగించేలా డీపీఆర్‌ను రూపొందించే పనులు హైదరాబాద్ మెట్రో రైలు సంస్థ చేపట్టింది. ఇందుకోసం ప్రత్యేకంగా సిస్ట్రా కంపెనీ క్షేత్ర స్థాయిలో సర్వే, మార్గాలను అధ్యయనం చేస్తూ డీపీఆర్ రూపొందించే పనులు చేస్తున్నా, స్థానికంగా ఉన్న పరిస్థితులతో స్పష్టమైన నిర్ణయాలు తీసుకోలేకపోతున్నారు.

జాతీయ రహదారుల సంస్థతో సంప్రదింపులు..

రెండో దశ మెట్రోను విస్తరించాలని ప్రతిపాదించిన మార్గాల్లో జాతీయ రహదారులు ఉన్నాయి. మొదటి దశ మెట్రో రైలు మార్గాన్ని పొడిగిస్తూ జాతీయ రహదారులపైనే ఎల్‌బీనగర్-హయత్‌నగర్, మియాపూర్-పటాన్‌చెరు, ఆరాంఘర్ నుంచి కొత్త హైకోర్టు వరకు మెట్రో మార్గాలను నిర్మించేందుకు మెట్రో యంత్రాంగం సర్వేలు, అధ్యయనాలు చేస్తోంది. దీంతో ఒకవైపు జాతీయ రహదారుల విస్తరణలో భాగంగా ఫ్లై ఓవర్ల నిర్మాణం పనులు జరుగుతుండగా, అక్కడ మెట్రో కోసం రైట్ ఆఫ్ వే కోసం మెట్రో అధికారులు జాతీయ రహదారుల సంస్థ అధికారులతో సంప్రదింపులు జరిపారు. ఆయా మార్గాల్లో మెట్రో కారిడార్‌ను ఎలా నిర్మించాలన్న దానిపై స్పష్టత రావాలంటే చాలా సమయమే పడుతుందని ఇటీవల చేపట్టిన సర్వే, అధ్యయనంలో గుర్తించారు. ఇప్పటికే జాతీయ రహదారులపై ఫ్లైఓవర్ బ్రిడ్జిలు నిర్మించాలని ప్రతిపాదనలు సిద్ధం చేయడంతో మెట్రో అలైన్‌మెంట్‌లో పెద్ద ఎత్తున మార్పులు చేయాల్సిన పరిస్థితి నెలకొందని, ఈ కారణంగా ప్రాజెక్టు అంచనా వ్యయం సైతం మారిపోయే అవకాశాలు ఉన్నాయని ఓ మెట్రో అధికారి తెలిపారు. మొత్తం రెండో దశ మెట్రో డీపీఆర్‌పై పూర్తి స్పష్టతకు మరింత సమయం తీసుకోవాల్సిన అవసరం ఏర్పడుతుందన్న అభిప్రాయాన్ని అధికారులు వ్యక్తం చేస్తున్నారు.

పీపుల్స్‌ప్లాజాలో వాకథాన్

ఖైరతాబాద్, జూలై 14 : అందరికీ ఆరోగ్యం అనే నినాదంతో ఫెడరేషన్ ఆఫ్ తెలంగాణ చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ (ఫ్యాప్సీ) ఆధ్వర్యంలో నెక్లెస్‌రోడ్డులోని పీపుల్స్‌ప్లాజాలో వాక్‌థాన్ నిర్వహించారు. ఈ వాకథాన్‌ను ఫ్యాప్సీ చైర్మన్ శేఖర్ అగర్వాల్, పద్మశ్రీ అవార్డు గ్రహీత డాక్టర్ గోఖలే, ఎల్వీ ప్రసాద్ ఐ ఇనిస్టిట్యూట్ డైరెక్టర్ డాక్టర్ ప్రశాంత్ గార్గ్, ఎంఎన్‌జే ఆస్పత్రి డైరెక్టర్ డాక్టర్ శ్రీనివాసులు, ఐఎంఏ అధ్యక్షుడు డాక్టర్ ద్వారకానాథ్, ప్రభుత్వ ఆయుర్వేద, యూనాని వైద్య కళాశాల విభాగాధిపతులు డాక్టర్ శ్రీకాంత్ బాబు, డాక్టర్ బుఖారితో కలిసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఆస్కీ డీన్ డాక్టర్ సుభోద్, ఫ్యాప్సీ అధ్యక్షుడు మీలా జయదేవ్, రిటైర్డ్ ఐఏఎస్ అధికారి అజయ్ మిశ్రా తదితరులు పాల్గొన్నారు.

మహాగణపతి..డెబ్బై అడుగులు

ఖైరతాబాద్, జూలై 14 : ఖైరతాబాద్ మహాగణపతి 70 ఏండ్ల చరిత్రలో డెబ్బై అడుగుల ఎత్తైన మట్టి విగ్రహం రూపుదిద్దుకుంటున్నది. ఈ ఏడాది సప్తముఖాలతో నిలబడి ఉండే ఆకారంలో స్వామి వారి విగ్రహాన్ని ప్రతిష్ఠిస్తున్నారు. గతేడాది 63 అడుగుల ఎత్తున మట్టి విగ్రహాన్ని ప్రతిష్ఠించగా, ఈ ఏడాది చరిత్రలోనే తొలిసారిగా 70 అడుగుల ఎత్తు, 28 అడుగుల వెడల్పులో విగ్రహాన్ని తయారు చేస్తున్నారు. శిల్పి చిన్న స్వామి రాజేంద్రన్ నేతృత్వంలో 25 మంది వెల్డర్లు, 150 మందికి పైగా ఇతర కార్మికులు షిఫ్టుల వారీగా విగ్రహ నిర్మాణంలో నిమగ్నమయ్యారు. ఇప్పటికే తల, కాళ్లు, నడుం భాగానికి సంబంధించిన వెల్డింగ్ పనులు పూర్తయ్యాయని ఉత్సవ కమిటీ తెలిపింది. ఇందుకు గాను ఆదిలాబాద్, జిన్నారానికి చెందిన నర్సయ్య ఆధ్వర్యంలో 25 మంది కార్మికులు షెడ్డు నిర్మాణాన్ని చేపడుతున్నారు.

50 బండిళ్ల వరిగడ్డి, వరిపొట్టు

స్టీలు, ఇనుప రాడ్స్‌లో ముందుగా స్వామి వారి 70 అడుగుల విగ్రహాన్ని రూపకల్పన చేస్తారు. అనంతరం అందులో వరిగడ్డి, పొట్టుతో, జనుము, గన్నీ బ్యాగ్స్‌తో ఫినిషింగ్ చేస్తారు. ఇటిక్యాల గ్రామానికి చెందిన దత్తాత్రేయరైస్ మిల్లు నుంచి వరిపొట్టును తెప్పించారు. ఇందులో 50 బండిళ్ల వరిగడ్డి, వరిపొట్టు, ఏలూరు నుంచి నల్లమట్టి, గుజరాత్ నుంచి తెప్పించిన బంకమట్టి, ఒక టిప్పర్ సన్నని ఇసుకను ఉపయోగిస్తున్నారు. చివర్లో ఒడిశాకు చెందిన జోగారావు, చెన్నైకి చెందిన మూర్తి, కాకినాడ, గొల్లపాలేంకు చెందిన భీమేశ్ ఆధ్వర్యంలో ఆరిస్టులు మోల్డింగ్ పనులను చేస్తారని ఉత్సవ కమిటీ చైర్మన్ సింగరి రాజ్ కుమార్ తెలిపారు.

బీసీ గణన తర్వాతే ఎన్నికలు నిర్వహించాలి

మధుయాష్కీకి వినతిపత్రం అందజేస్తున్న దుర్గయ్యగౌడ్

వనస్థలిపురం, జూలై 14 : రాష్ట్రంలో బీసీ గణన జరిగిన తర్వాతే పంచాయతీ ఎన్నికలు నిర్వహించాలని తెలంగాణ బీసీ సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు దుర్గయ్యగౌడ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాస్కీ గౌడ్‌ను ఆదివారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో బీసీలు రాజకీయంగా ఎదగాలంటే లెక్కలు తేల్చి రిజర్వేషన్లు పెంచాలని కోరారు. జనగణన చేయకుండా ఎన్నికలకు వెళ్తే కాంగ్రెస్‌కు ఓటమి తప్పదన్నారు. జాతీయ స్థాయిలో కూడా కాంగ్రెస్ పార్టీ బీసీ గణనకు హామీ ఇచ్చిందన్నారు. ఈ కార్యక్రమంలో సమాఖ్య నాయకులు వెంకటేశ్వర్లు, యాదయ్య, రవి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కేంద్రం నిర్లక్ష్యంతోనే నీట్ లీకేజీ

సమావేశంలో మాట్లాడుతున్న సామాజికవేత్త అరుణ్ కుమార్

ఖైరతాబాద్, జూలై 14 : కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యం వల్లే నీట్ పేపర్ లీకేజీ అయ్యిందని, అయినా కేంద్రానికి పట్టింపులేదని సామాజిక వేత్త అరుణ్ కుమార్ అన్నారు. భారత ఐక్య విద్యార్థి ఫెడరేషన్ ఆధ్వర్యంలో సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నీట్ పేపర్ లీకేజీ అనేది దురదృష్టకరమైన సంఘటన అని, ఈ ఘటనకు బాధ్యత వహిస్తూ ప్రధాని రాజీనామా చేయాలన్నారు. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీని రద్దు చేసి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం పలువురు ఎస్ ఎఫ్ఐ నాయకులు యూఎస్ఎఫ్ఐలో చేరారు. ఈ సమావేశంలో ఆల్ ఇండియా కిసాన్ ఫెడరేషన్ జాతీయ కార్యదర్శి మోర్తాల చందర్ రావు, భారత ఐక్య విద్యార్థి ఫెడరేషన్ ఏపీ అధ్యక్షుడు ఉదయ్ కుమార్, తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి మాదం తిరుపతి, ఉపాధ్యక్షుడు మాలోతు రాజేశ్ నాయక్, సంద గణేశ్, మధు, రంగస్వామి, తదితరులు పాల్గొన్నారు.

నినాదాలు చేస్తున్న మైనార్టీ రెసిడెన్షియల్ పాఠశాల టీచర్లు

రెగ్యులరైజ్ చేయండి

ఖైరతాబాద్, జూలై 14 : తెలంగాణ మైనార్టీ రెసిడెన్షియల్ పాఠశాలల్లో పనిచేస్తున్న తమను రెగ్యులరైజ్ చేయాలని టీచర్లు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం సాయంత్రం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో టీచర్లు షమీమా, సల్మా కతూన్ అరుణ మాట్లాడుతూ 2000 సంవత్సరంలో అప్పటి ఉమ్మడి రాష్ట్రంలో జనరల్ రెసిడెన్షియల్ పాఠశాలలో బోధకులుగా నియమితులయ్యామన్నారు. అప్పుడు 12 పాఠశాలలు ఉండేవని 2016లో ఆయా పాఠశాలలు మైనార్టీ వెల్ఫేర్ డిపార్ట్ పరిధిలోకి వచ్చిందన్నారు. సుమారు 31 మంది టీచింగ్ సిబ్బంది పని చేస్తున్నారని, ఇతర రెసిడెన్షియల్ పాఠశాలల టీచర్లను రెగ్యులరైజ్ చేశారని, తమను పర్మినెంట్ చేయకుండా వివక్ష చూపుతున్నారన్నారు. సమావేశంలో హబీబా సయ్యద్, రజియా సుల్తానా, తన్వీర్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

మెర్సిడెస్ బెంజ్ సరికొత్త మోడల్

జూబ్లీహిల్స్,జూలై14: మెర్సిడెస్ బెంజ్ సిల్వర్ స్టార్ సరికొత్త మెర్సిడెస్ బెంజ్ ఈక్యూఏ 250 ప్లస్ ను సీఈఓ సేతే మాధవన్ గోల్కొండ రిసార్ట్స్ అండ్ స్పాలో నిర్వహించిన ఓ కార్యక్రమంలో ఆవిష్కరించారు. ఈక్యూఏ 250 స్థిరమైన లగ్జరీ, వినూత్నమైన టెక్నాలజీతో పాటు వినియోగదారుల విభిన్న శైలిని, స్థిరత్వాన్ని ప్రస్ఫుటం చేస్తాయని తెలిపారు.